ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
జనగామ
ఆదివారం 14 జనవరి 2024



జనగామలో కిటకిటలాడుతున్న పతంగుల షాపులు



జనగామ బస్టాండులో ప్రయాణీకుల రద్దీ

మూడు రోజుల వేడుకలకు ముస్తాబైన పల్లె, పట్టణాలు

సొంత గ్రామాలకు చేరుకుంటున్న ప్రజలు

వైష్ణవాలయాల్లో నేడు గోదా, రంగనాథుల కల్యాణం

ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ

నేడు భోగి, రేపు సంక్రాంతి పర్వదినం

పండుగ కళ

జనగామ కల్చరల్, జనవరి 13: సంస్కృతి, సంప్రదాయాల మేళవింపు .. సరదాలు పంచే వేడుక.. మూడు రోజుల మురిపెం.. సంక్రాంతి పర్వదినం... ఈ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఉపాధి కోసం ఉన్న ఊరిని, కన్న తల్లిని వదిలి వెళ్లిన వారు మూట ముల్లె సర్దుకొని సొంతూళ్లకు చేరుకుంటున్నారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో మొదటిదైన భోగి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకోనున్నారు. 15న సంక్రాంతి, 16న కనుమ వేడుకలు జరుగుతాయి. సంక్రాంతి సంబరాల కోసం తరలివచ్చిన ప్రజానీకంతో పల్లెలన్నీ సందడిగా మారాయి. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణం లోకి ప్రవేశించి ధనూరాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే రోజును మకర సంక్రమణంగా చెబుతారు. సంక్రాంతి ముందు రోజును భోగి పర్వదినంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. పిల్లలకు సాయంత్రం వేళ భోగిపండ్లు పోసి ఆశీర్వదిస్తారు.

రంగవల్లులు, గొబ్బెమ్మలు..

సంక్రాంతి అంటేనే ముగ్గులకు ప్రత్యేకం. పండుగ నెల రోజులు ఉండగానే మహిళా మణులు తమ ఇళ్ల ముందు రోజుకో ముగ్గును వేస్తూ ముంగిళ్లను అందంగా అలంకరిస్తారు. ఇందు కోసం జిల్లా కేంద్రంలో రంగు రంగుల ముగ్గుల దుకాణాలు సందడి చేస్తున్నాయి. పిండితో ముగ్గు వేసి అందులో గొబ్బెమ్మను (గౌరమ్మను) పెట్టి చుట్టూ తిరుగుతూ పాటలు పాడి నృత్యాలు చేస్తారు. ముగ్గును లక్ష్మీదేవికి చిహ్నంగా భావిస్తారు. పొద్దు పొద్దున్నే అలుకు చల్లి ముగ్గులు వేసి లక్ష్మీదేవిని తమ ఇళ్ల లోకి ఆహ్వానిస్తారు. ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ముగ్గు మధ్యలో ఉంచుతారు. గొబ్బెమ్మలపై ప్రకృతిలో దొరికే గరక పోసలను పెట్టి, పూల రేకులు, పసుపు కుంకుమను చల్లి, వాటి చుట్టూ నవధాన్యాలు, రేగు పండ్లు పోసి ప్రత్యేకంగా పూజలు చేస్తారు. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు కూడా నిర్వహిస్తారు.

మహిళలకు సంక్రాంతి కానుక...

కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించింది. ఉచితంగా ప్రయాణం కల్పించిన తరువాత తొలిసారిగా వచ్చిన పండుగ సంక్రాంతి కావడంతో మహిళలు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. పెట్టే, బేడా సర్దుకొని ఆధార్ కార్డులు చేతబూని బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఈ సారి సంక్రాంతి పర్వదినం కొత్త దనంతో నిండిపోయింది.



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

నేడు గోదా కల్యాణం ...

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వైష్ణవాలయాల్లో గోదా కల్యాణం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 14వ తేదీ ఉదయం అమ్మవారికి తిరుమంజన సేవ, ఉదయం 10.30 గంటలకు గోదా కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. 15న మకర సంక్రాంతి కాగా, 16న గోపూజతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ ప్రధానార్చకులు, యాదాద్రి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి కృష్ణమాచార్య సిద్ధాంతి తెలిపారు.

ఎగురనున్న పతంగులు ...

సంక్రాంతి సందర్భంగా పతంగుల ఎగురవేయడం ఆనవాయితీ. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ గాలిపటాలు ఎగురవేస్తారు. రంగు రంగుల గాలిపటాలతో ఖరీదైన మాంజాలతో పోటాపోటీగా పతంగులతో సందడి చేస్తారు. దీంతో ఇప్పటికే జిల్లా కేంద్రం లోని రైల్వే స్టేషన్, బస్టాండు ప్రాంతాలు పతంగుల విక్రయాలకు అడ్డాలుగా మారాయి. నెహ్రూ పార్కు, రైల్వేస్టేషన్ ఏరియా, గీతాశ్రమం ప్రాంతాలు విక్రయాలు, కొనుగోళ్లతో రద్దీగా మారాయి.

పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు...

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. జిల్లా కేంద్రం నుంచి జగద్గిరిగుట్ట, జేబీఎస్, ఉప్పల్, కొమురవెల్లి, పాలకుర్తి ప్రాంతాలకు అదనపు బస్సులను కేటాయించింది. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో ఆయా గ్రామాలకు వెళ్లే బస్సులతో పాటు డిపోలో ఉన్న బస్సులతో అదనపు ట్రిప్పులు నడుపుతున్నామని జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ జ్యోత్స్న తెలిపారు. 83 బస్సులు షెడ్యూల్ ట్రిప్పులు ఉండగా 23 బస్సులను అదనంగా నడుపుతున్నామని అన్నారు.



నెహ్రూ పార్కు వద్ద రేగుపండ్లు, పిండి, గరక పోసల విక్రయాలు

సాహిత్య నిలయం జనగామ

- ప్రజా కవి జయరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జయరాజు

జనగామ టౌన్, జనవరి 13: తెలుగు సాహిత్యానికి నెలవు, కవులు కళాకారులకు పుట్టినిల్లు జనగామ ప్రాంతమని ప్రజా కవి, రచయిత, గాయకుడు జయరాజు అన్నారు. ఎన్‌పీడీసీఎల్ ఉద్యోగి నక్క సురేశ్ రచించిన 'జ్ఞాన పుష్పం' పుస్తకాన్ని శనివారం జనగామలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంబరాజు యాదగిరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జయరాజు మాట్లాడారు. జనగామ జిల్లాలో బమ్మెర పోతన, పాలకుర్తి సోమనాథుడు వంటి గొప్ప కవులు జన్మించారని, ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ఎందరో కవులు ఈ ప్రాంతంలో పుట్టుకురావడం సంతోషంగా ఉందని అన్నారు. సురేశ్ రాసిన జ్ఞానపుష్పం పుస్తకంలో సమాజాన్ని ఎలా అంచనా వేయాలో వివరించారని, ఇలాంటి పుస్తకాలు మరెన్నో రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, పసునూరి రవీందర్, కోడం కుమారస్వామి, ప్రముఖ డాక్టర్ సీహెచ్.రాజమౌళి, రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి, డాక్టర్ ప్రీతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ చీటూరు నర్సింహులు, జేరిపోతుల పరశురాం తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీపై యువతలో క్రేజ్

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తిలో కొనసాగుతున్న పోటీలు



కబడ్డీ ఆడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి, జనవరి 13 : కబడ్డీపై యువతలో ఇప్పుడిప్పుడే క్రేజ్ పెరుగుతోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీఉన్నత పాఠశాల మైదానంలో యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ పోటీలను ప్రారంభించిన ఎర్రబెల్లి కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాల్లోకి రాకముందు తాను వరంగల్ జిల్లా కబడ్డీ కెప్టెన్‌గా ఉన్నానని గుర్తు చేశారు. గతంలో ప్రభుత్వం అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేలతో నిర్వహించిన క్రీడల్లో సైతం కబడ్డీ ఆడి మొదటి బహుమతి గెలుచుకున్నానని అన్నారు. చిన్నప్పటి నుంచి ఆటలు ఆడడంతోనే ఇప్పటికీ తాను ఆరోగ్యంగా ఉన్నానని అన్నారు. గెలుపు ఓటములు సహజమేనని, ఓడినా.. గెలిచినా సమంగా స్వీకరించాలని సూచించారు. క్రీడలతో పాటు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రత్యేక కోటా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాసరావు, సర్పంచు యాకాంతరావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్, నాయకులు బత్తిని గోపాల్, పాము శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్ రెడ్డి, మాచెర్ల ఎల్లయ్య, బొమ్మగాని కొంరయ్య, నకీర్త యాకయ్య, రాజేశ్వర్‌రావు, యువ చైతన్య యూత్ బాధ్యులు ఎడవెల్లి సోమేశ్వర్, ఉలమకంటి సందీప్, చిట్యాల రఘు, శ్రీకాంత్, పీఈటీలు శ్రీనివాస్, మల్లికార్జున్, రాజయ్య, సోమల్లు తదితరులు ఉన్నారు.

హాస్టల్ భవనంలో కోర్టు వద్దు

అధికారులను అడ్డుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

న్యాయవాదులతో వాగ్వాదం

సీఐ చొరవతో సద్దుమణిగిన గొడవ



ఇరువర్గాలకు నచ్చచెపుతున్న సీఐ సత్ల రాజు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 13: డివిజన్ కేంద్రంలో ఖాళీగా ఉంటున్న ఎస్సీ బాలుర హాస్టల్ భవనంలో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తం కాగా స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డుకున్నారు. అక్కడే ఉన్న న్యాయవాదులు వారిని వారించే ప్రయత్నం చేయగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. చివరికి పోలీసులు రంగప్రవేశం చేసి గొడవను సద్దుమణిగించారు. వివరాల్లోకి వెళితే.. స్టేషన్‌ఘన్‌పూర్‌కు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టును మంజూరు చేస్తూ గత సంవత్సరం అక్టోబరు 6న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో నెంబరు 60ని జారీ చేసింది. అయితే ప్రస్తుతం దీనికి భవనం లేకపోవడంతో డివిజన్ కేంద్రంలో ఖాళీగా ఉంటున్న ఎస్సీ బాలుర (బి) వసతి గృహంలో తాత్కాలిక కోర్టును ఏర్పాటు చేయడానికి అనుమతి ఇప్పించాలని కోరుతూ న్యాయవాదులు పలుమార్లు కలెక్టర్‌ను కోరారు. దీంతో ఆయన జనవరి 6న అందుకు అనుమతి ఇస్తూ ఆర్డర్ జారీ చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు శనివారం వసతిగృహంలో ఉన్న వస్తువులను మరో హాస్టల్‌కు తరలిస్తుండగా ఎమ్మార్పీఎస్ నాయకులు వారిని అడ్డుకున్నారు. హాస్టల్ తరలిపోతే మళ్లీ తిరిగిరాదని, ఎట్టి పరిస్థితుల్లో అందుకు ఒప్పుకునేది లేదని వారించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న న్యాయవాదులు కల్పించుకొని డివిజన్ కేంద్రానికి కోర్టు వస్తున్నందుకు సహకరించాల్సింది పోయి అడ్డుపడడం

మిగతా 8వ పేజీలో...

కురుమలది మాట తప్పని నైజం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



లింగాలఘణపురంలో కురుమసంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కడియం శ్రీహరి

లింగాలఘణపురం, జనవరి13: కురుమలది మాట తప్పని నైజమని నీతికి, నిజాయితీకి నిదర్శనమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం లింగాలఘణపురంలో ఆయన కురుమ సంఘం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో కురుమలకు సముచిత స్థానం కల్పించిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. ఎమ్మెల్సీగా ఎగ్గె మల్లేశం, జనగామ మార్కెట్ చైర్‌పర్సన్‌గా బాల్దె సిద్దిలింగం, కొమురవెల్లి దేవస్థానం చైర్‌పర్సన్‌గా సేవెల్లి సంపత్‌కు అవకాశం ఇచ్చింది కేసీఆర్ మాత్రమేనన్నారు. అంతేకాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు గొర్రెలపంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది కూడా కేసీఆరేనన్నారు. సబ్సిడీ గొర్రెల కోసం ఇప్పటికే డీడీలు చెల్లించి సిద్ధంగా ఉన్నారని కానీ కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందో వేచిచూడాలని అన్నారు. కాంగ్రెస్ మెనిఫెస్టోలో కూడా 100 రోజుల్లో సబ్సిడీ గొర్రెలను అందజేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బాల్దె సిద్దిలింగం, కురుమ సంఘం మండల అధ్యక్షుడు బండ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి వట్టిపల్లి సంపత్, నాయకులు సేవెల్లి సంపత్, చౌదరిపల్లి విజయ్‌భాస్కర్, గొరిగె మదార్, ఎంపీటీసీ కేమిడి భిక్షపతి, చౌదరిపల్లి శేఖర్, కేమిడి వీరసాయిమల్లేశం, మోటె వీరస్వామి, కేమిడి వెంకటేశ్, బర్లకుమార్, గవ్వల మల్లేశం, రేగు అంజయ్య పాల్గొన్నారు.

కోడూరులో క్యాలెండర్ల ఆవిష్కరణ..

రఘునాథపల్లి: మండలంలోని కోడూరు గ్రామంలో ఒగ్గు..బీర్ల కళాకారులతో పాటు కురుమ సంఘానికి సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒగ్గు,బీర్ల కళాకారులకు పెన్షన్‌తో పాటు ఇళ్ల మంజూరుకు, కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాలకు నిధులు కేటాయించడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మడికంటి కరుణాకర్, జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, ఎంపీపీ మేకల వరలక్ష్మి, మారజోడు రాంబాబు, ఎంపీటీసీ గూడెల్లి శిరిష, ఒగ్గు బీర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒగ్గు ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమంతుడిపై భక్తితో..

ఆలయం ఎదుట బోరువేసి మోటారు అందించిన యువకుడు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 13: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ముక్కెర మధు అనే యువకుడు హనుమాన్‌పై భక్తిని చాటుకున్నాడు. రూ.60వేలు వెచ్చించి శనివారం హనుమాన్ ఆలయం ఎదుట బోరు వేయించడంతో పాటు బోరు మోటర్‌ను అందించారు. ఈ సందర్భంగా మధుకర్‌ను గ్రామస్థులు, నాయకులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ముక్కెర దశరథ్, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, నరేష్, చుక్కారెడ్డి, వీరారెడ్డి, కారోబార్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



బోరును వేయిస్తున్న దాత మధుకర్

భవనానికి రంగులు వేయడానికి వచ్చి..

బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టుకు ఢీ

అక్కడికక్కడే ఇద్దరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు..

తాడ్వాయి మండలంలో ఘటన

మృతులది శాయంపేట మండలం పత్తిపాక

పనికి తీసుకెళ్లిన వ్యక్తి బాధ్యత వహించాలని గ్రామంలో ధర్నా





వెల్తూరి పవన్, పోతుగంటి వంశీ (ఫైల్)

వివరాలు 6వ పేజీలో

పేకాటరాయుళ్ల అరెస్టు

జనగామ టౌన్, జనవరి 13: పేకాట శిబిరంపై జనగామ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. శనివారం సాయంత్రం జనగామ పట్టణంలోని కళ్లెం రోడ్డులో చెట్ల పొదల మధ్య కొందరు పేకాట ఆడుతుండగా విషయం తెలుసుకున్న జనగామ సీఐ శ్రీనివాస్‌యాదవ్ తమ సిబ్బందితో కలిసి సివిల్ డ్రస్సుల్లో స్థావరం వద్దకు వెళ్లారు. పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.97,910తో పాటు 13 సెల్‌ఫోన్లు, 8 బైక్‌లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై అరుణ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సంచిలో డబ్బులు.. జేబులో సరుకులు!



- నిప్పులు కురుస్తున్న పప్పులు, నువ్వులు
- ఘాటెక్కిన అల్లంఎల్లిపాయె
- సామాన్యుడు పండుగ చేసుకునే పరిస్థితి లేదు

రఘునాథపల్లి, జనవరి 13: నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయి. నాలుగు నెలల కాలంలో సరుకుల ధరలు 30 నుంచి 40 శాతానికి పెరిగాయి. సంచి నిండా డబ్బులు తీసుకెళ్లి జేబుల్లో సరుకులు తెచ్చుకునేలా పరిస్థితులు మారాయి. ఏ వస్తువు ధర చూసినా సామాన్యుడి గుండె ఆగినంత పనవుతోంది. పప్పులు నిప్పుల్లా వేగుతున్నాయి. ఎల్లిగడ్డ ధర ఘాటెక్కింది. కూరగాయలు సగటు జీవిని గాయపరుస్తున్నాయి. వంట గ్యాస్ సంగతైతే సరేసరి.. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగకు సకినాలు కరకరలాడే పరిస్థితులు కన్పించడం లేదు. పిండి వంటల వాసనలు ఘుమఘుమలాడేలా లేవు. ఆకాశాన్నంటిన ధరలతో సామాన్యుడు పండుగ పూట పస్తులుండే పరిస్థితులు వచ్చాయి. పండుగ రోజు కాసిన్ని పిండి వంటలు చేసుకొని కుటుంబ సభ్యులతో కలిసి తినే భాగ్యానికి కూడా నోచుకోవడం లేదు.

ఆకాశంలో నిత్యావసర వస్తువుల ధరలు

దడ పుట్టిస్తున్న ధరలు

పండుగ పూట నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులకు దడ పుట్టిస్తున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా అవసరమైన శెనగ పప్పు, కంది పప్పు, మినప పప్పు, పల్లీలు, గోధుమ పిండి, బెల్లం ధరలతో పాటు వెల్లుల్లి ధరలు విపరీతంగా పెరిగాయి. శెనగ పప్పు కిలోకు రూ.90, కంది పప్పు రూ.140, మినప పప్పు రూ.120, వెల్లుల్లి రూ.280, పల్లీలు రూ.140, బెల్లం రూ.60, గోధుమ పిండి రూ.60 ధర పలుకుతున్నాయి. దీనికి తోడు కూరగాయలు చిక్కుడు, బీరకాయ కిలోకు రూ.100 నుంచి 110, కోడిగుడ్డు ఒకటి రూ.6.50 పైసల నుండి రూ.7 వరకు ధర పలుకుతున్నాయి.

పప్పులు నిప్పులు...ఘాటెక్కిన వెల్లుల్లి

పిండి వంటలు చేసుకోవడానికి పప్పులే ముఖ్యం. ఏ పప్పును ముట్టుకున్నా వాటి ధరలు నిప్పుల్లా కాలుతున్నాయి. కూరలతో పాటు పిండి వంటలలో విధిగా వాడే వెల్లుల్లి ధరల ఘాటు నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

పలహారం...మహాభారం

సంక్రాంతి అంటే పిండి వంటల పండుగే. పండుగ రోజు సామాన్యుడు కుటుంబ సభ్యులతో కలిసి ఏడాదిలో ఒక్కసారైనా కాసిన్ని పిండి వంటలు చేసుకోవాలనుకుంటాడు. కానీ మండుతున్న ధరలను చూసి ఆ సాహసం చేయలేకపోతున్నాడు. సంక్రాంతికి పలహారాలు చేసుకోవడానికి సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారు జంకుతున్నారు.

'గ్యాస్' ట్రుబుల్...కూర 'గాయాలు'

ప్రస్తుతం వంట గ్యాస్ బుక్ చేసిన 15 రోజుల వరకు రావడం లేదు. ఇళ్లలో వాడాల్సిన వంట గ్యాస్ సిలిండర్లు వ్యాపార సంస్థలకు తరలిపోతుండడంతో వంట గ్యాస్ కొరత తలెత్తుతోంది. కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. బీరకాయ, చిక్కుడు కాయ కిలోకు రూ.100, బెండకాయ, వంకాయ కిలోకు రూ.60 పలుకుతున్నాయి.



సంఘటనా స్థలిలో వంశీ, పవన్ మృతదేహాలు

భవనానికి రంగులు వేయడానికి వచ్చి..

- బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టుకు ఢీ
- అక్కడికక్కడే ఇద్దరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



పత్తిపాకలో సుధాకర్ ఇంటి ఎదుట మృతదేహాలతో బంధువుల ఆందోళన

తాడ్వాయి/శాయంపేట, జనవరి 13: జనవరి 13: పీఏసీఎస్ నూతన భవనానికి రంగులు వేయడానికి వచ్చిన వారిలో ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఇందులో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని నాంపల్లి బంజర గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పోతుగంటి వెంకటేశ్వర్లు-వనితల కుమారుడు వంశీ(23), ఎల్తూరి మొగిలి-జయలక్ష్మిల కుమారుడు పవన్(22), మామిడి కుమారస్వామి - అన్నపూర్ణల కుమారుడు భాస్కర్(30)లు తాడ్వాయి మండల కేంద్రంలోని పీఏసీఎస్ నూతన భవనానికి రంగులు వేయడానికి వచ్చి పనులు చేపడుతున్నారు. అక్కడ పని ముగిశాక కాటాపూర్‌లోని పీఏసీఎస్ గిడ్డంగి భవనానికి కూడా రంగులు వేసి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తిరిగి తాడ్వాయికి వస్తున్నారు. ఈ క్రమంలో నాంపల్లి బంజర మూలమలుపు వద్దకు చేరుకోగానే వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో వంశీ, పవన్‌లు రోడ్డుకు పది మీటర్ల దూరంలో ఎగిరిపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మామిడి భాస్కర్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం కాటాపూర్ వెళ్లే వాహనదారులు వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతుల కుటుంబాలకు సమాచారం అందించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, మృతుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వివరించారు. కాగా, వీరందరూ అవివాహితులని తెలిపారు.

పత్తిపాకలో ఉద్రిక్తత

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబాలకు న్యాయం చేయాలని బంధువులు, మద్దతుదారులు మృతదేహాలతో ఆందోళనకు దిగారు. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పోతుగంటి సుధాకర్.. వెల్తూరి పవన్(22), పోతుగంటి వంశీ(23), మామిడి భాస్కర్‌లను ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని పీఏసీఎస్ భవనాలకు రంగులు వేయించడానికి తీసుకెళ్లారని, దీనికి యువకుల మృతికి పోతుగంటి సుధాకర్ బాధ్యత వహించి మృతుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని శనివారం మృతదేహాలను సుధాకర్ ఇంటి వద్ద వేసి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మూడుగంటల ఉద్రిక్తతల నడుమ సీఐ మల్లేష్‌తోపాటు శాయంపేట, ఆత్మకూరు, దామెర, పరకాల ఎస్సైలు మృతుల బంధువులను సముదాయించారు. సుధాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మృతదేహాలను తీసుకుని వెళ్లారు. అనంతరం మృతదేహాల వాహనాన్ని గ్రామంలోని ప్రధానరోడ్డుపై నిలిపి సుధాకర్‌ను తీసుకొచ్చేవరకు మృతదేహాలను తీసుకెళ్లేది లేదని రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో మళ్లీ పోలీసులు ప్రవేశించి కుటుంబ సభ్యులు, బంధువులు, మద్దతుదారులకు సర్ది చెప్పి మృతదేహాలను తరలించారు. మృతి చెందిన యువకులను పనికి తీసుకెళ్లిన సుధాకర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

» అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

» ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త

» అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం



సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్న, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రియా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం



మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో.. మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటుకున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లానని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చెలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

» ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు

» అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో

» 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

» అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం

» రైలు పట్టాలపై పడిన గాలి పటం

» నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలి పటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

మహిళలకు ధ్యానం ఎంతో అవసరం : మహబూబాబాద్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సుంకరనేని నాగవాణి



బహుమతులు పొందిన మహిళలతో సుంకరనేని నాగవాణి

చిన్నగూడూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 13: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మహబూబాబాద్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ సుంకరనేని నాగవాణి అన్నారు. శనివారం చిన్నగూడూరు మండలంలోని జయ్యారం గ్రామంలో 'హార్ట్‌ఫుల్ నెస్ ఆధ్యాత్మిక ధ్యాన శిక్షణ సంస్థ' జయ్యారం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 200 మంది ఉత్సాహవంతమైన మహిళలు పాల్గొన్నారు. దీంతో జయ్యారంలో సంక్రాంతి సందడి వాతావరణం ఒకరోజు ముందే నెలకొంది. విజేతలతో పాటు ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి హార్ట్ ఫుల్‌నెస్ ధ్యాన శిక్షణ సంస్థ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుంకరనేని నాగవాణి మాట్లాడుతూ.. పనిఒత్తిడితో కూడుకున్న నేటి మహిళలకు ధ్యానం ఎంతో అవసరమని అన్నారు. ధ్యానం చేయడం ద్వారా సమాజ అభివృద్ధి త్వరితగతిన జరుగుతుందని, హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ నిస్వార్థంగా, శాస్త్రీయ పద్ధతిలో ఉచితంగా అందించే ధ్యానంను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ధ్యానంతో ధైర్యంగా త్వరితగతిన నిర్ణయాలు జరిగి, మహిళలు అన్నిరంగాల్లో ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మ వెంకట్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ రాధ ముత్తయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ, శిక్షకులు నరేందర్, వెంకటయ్య, విజయ, జనార్ధనాచారి, కేశవరావు, కవిత, జగన్నాథరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

'చలో మేడారం' ఫోక్ సాంగ్ చిత్రీకరణ



షూటింగ్‌లో డ్యాన్స్ వేస్తున్న కళాకారులు

మేడారం, జనవరి 13: తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారలమ్మ ఫోక్ హంగామా ప్రొడక్షన్ ఆధ్వర్యంలో 'చలో మేడారం' సాంగ్ చిత్రీకరణను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత డాక్టర్ కిన్నెర స్వాతి మాట్లాడుతూ.. వనదేవతలకు మొక్కులో భాగంగా ఈ చిత్రాన్ని మేడారంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు సమక్షంలో తల్లుల ప్రధాన గేటు ముందు ఐల్యాండ్ వద్ద ప్రారంభించామన్నారు. సాంగ్ ప్రారంభంలో పూజారుల పరిచయం ఉంటుందని తెలిపారు. ఈ చిత్రం మూడు రోజులు మేడారంలో జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో రూపొందించనున్నట్లు తెలిపారు. చిత్రం ద్వారా 900 మందికి ఉపాధి కల్పిస్తున్నామని, పూర్తి చేయడానికి రూ.22లక్షల ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు జాన్ రఘు, సంగీత దర్శకుడు ఎస్కే బాజీ, సిబ్బంది, కళాకారులు, సినీ బృందం పాల్గొన్నారు.

వ్యవసాయ పంపు సెట్లకు జియో టాగింగ్ లేదు

నయీంనగర్, జనవరి 13: ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లకు జియో ట్యాగింగ్ చేయడం లేదని టీఎస్‌ఎన్ పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడారు. 2021వ సంవత్సరంలో డీటీఆర్ (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్)లను 11 కేవీ ఫీడర్ లైన్ల మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఒక పత్రికలో 'వ్యవసాయానికి జియో ట్యాగింగ్ ' అని ప్రచురితమైన, వాట్సాప్‌లో వైరల్ అవుతున్న వార్త పూర్తిగా తప్పుడు వార్త అని, అవాస్తవమని సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు.

మొండ్రాయి యువకుడు జియో సైంటిస్ట్‌గా ఎంపిక



శ్రీకాంత్

సంగెం, జనవరి 13: మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన రైతు బిడ్డ సింగిరెడ్డి శ్రీకాంత్ జియో సైంటిస్టుగా(గెజిటెడ్ అధికారిగా) ఎంపికయ్యారు. శుక్రవారం వెలువడిన యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) గ్రూపు-ఎ ఫలితాల్లో శ్రీకాంత్ 113వ ర్యాంక్ సాధించారు. ప్రిలిమరీ పరీక్ష(హాల్‌టికెట్ నంబరు 1090478) గత యేడాది ఫిబ్రవరి 18న, మెయిన్స్ జూన్ 25, 26 తేదీల్లో రాశారు. గత డిసెంబరు 5న ఢిల్లీలో ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కాగా, ఈనెల 12న ఫలితాలు విడుదల కాగా, శ్రీకాంత్ 113వ ర్యాంకు సాధించారు. పదో తరగతి వరకు గ్రామంలో, ఇంటర్ నర్సంపేటలో పూర్తి చేశారు. డిగ్రీ హనుమకొండలో, ఎమ్మెస్సీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు.

శ్రీకాంత్ జియో సైంటిస్టుగా ఎంపిక కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. శ్రీకాంత్ తండ్రి సింగిరెడ్డి కుమారస్వామి తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో పంటలు పండిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తల్లి, తండ్రి అందించిన ప్రోత్సాహంతో చదువులో ముందంజలో నిలుస్తూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం శ్రమించారు. తండ్రికి వ్యవసాయంలో సహకారం అందిస్తూనే యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యారు. కాగా, శ్రీకాంత్‌ను పలువురు అభినందించారు.

సమాచార హక్కు పరిరక్షణ సమితి కోఆర్డినేటర్‌గా మధు



హనుమకొండ రూరల్, జనవరి 13: జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్‌గా హనుమకొండకు చెందిన సీనియర్ జర్నలిస్టు గాడిపల్లి మధును ఎంపిక చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని పేర్కొన్నారు.

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

జనగామ కల్చరల్, జనవరి 13: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. వనిత క్లబ్, వాసవి క్లబ్, ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు స్థానిక గాయత్రి గార్డె న్స్ వేదికైంది. సాహిత్య అకాడెమీ కార్యదర్శి డాక్టర్ ఎన్.బాలాచారి ముఖ్య అతిథిగా హాజరు కాగా మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, లింగయ్య, చంద్రజ్యోతి, వరూథిని, పడకంటి రవీందర్, గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, అనూజ, సంతోష్, బేగం, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. పులివెందుల నాగమణి, మంచన హరీష్, గట్టు రాధాకృష్ణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

గ్రామాల్లో జోరుగా సంక్రాంతి ఆటల పోటీలు

బచ్చన్నపేట: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో ఆటల పోటీలు జోరుగా నిర్వహిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ పండుగకు పోటీ పడి ఆటలు నిర్వహించటం వెనుక ముందున్న ఎన్నికలే కారణంగా కనిపిస్తోంది. కొద్ది నెలల్లోనే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉండటంతో వాటిని ఆశిస్తున్న వివిధ పార్టీల నాయకులు ఈ ఆటల నిర్వహణకు ముదుకు వస్తున్నారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు సైతం పోటీలు నిర్వహిస్తున్నాయి. బచ్చన్నపేటతో పాటు లక్ష్మాపూర్, మన్‌షాన్‌పల్లి తదితర గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్, చెస్, ఖోఖో, కబడ్డీతో పాటు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు పెద్ద ఎత్తున బహుమతులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమ్మక్క జాతర చైర్మన్‌గా కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి



చిలుపూర్, జనవరి 13: మండలంలోని శ్రీపతిపల్లి - కొండాపూర్ సమ్మక్క సారలమ్మ వన దేవతల జాతర కమిటీ చైర్మన్‌గా శ్రీపతిపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డిని రెండు గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి పలు పార్టీలకు చెందిన ముఖ్య నాయకులంతా హాజరయ్యారు. అంతకుముందు వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా నాయకులంతా పార్టీలకతీతంగా మనోజ్‌రెడ్డి వైపు మొగ్గు చూపారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా పుట్ట రాజు, ప్రధాన కార్యదర్శిగా రంగు రమేష్, కోశాధికారిగా కేశిరెడ్డి కరుణాకర్ రెడ్డి, పులి సంపత్‌తో పాటు, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో వన దేవతల జాతరను విజయవంతం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో లోడెం రవిందర్, కౌడ సంపత్, కొండ తిరుపతి, రంగు హరీష్, గడ్డం సిద్ధయ్య, గాలి రాజు, మహేశ్, దేవేందర్, పోతరాజు, అనిల్, కనకయ్య, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న కీర్తన

ఇప్పటివరకు రెండు స్వర్ణ, మూడు కాంస్య పతకాలు సొంతం



బంగారు పతకం చూపిస్తున్న కీర్తన

పాలకుర్తి, జనవరి 13: మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన చెరుపల్లి కీర్తన అథ్లెటిక్స్‌లో రాణిస్తోంది. ఆమెకు చిన్నప్పటి నుంచి ఆటలంటే చాలా ఇష్టం. దీంతో చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తోంది. 2021లో కేరళలోని క్యాలికట్‌లో జరిగిన 34, సౌత్‌జోన్ నేషనల్స్‌లో ఆమె బంగారు పతకం సాధించగా, 2022లో ఆంధ్రప్రదేశ్ గుంటూరులో జరిగిన 35 సౌత్‌జోన్ నేషనల్స్‌లో రజతం సాధించింది. 2022లో మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన 34వ యూత్ నేషనల్స్‌లో కాంస్య పతకం సాధించింది. 2022లో కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపిలో జరిగిన 35వ యూత్ నేషనల్స్‌లో బంగారు పతకం సాధించింది. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో 2023లో మధ్యప్రదేశ్‌లో భోపాల్‌లో జరిగిన 24వ ఫెడరేషన్ కప్‌లో కాంస్యం సాధించింది. నాలుగేళ్లలో జాతీయ స్థాయి టోర్నమెంట్‌లతో పాటు రెండు ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్‌లోనూ కీర్తన ప్రతిభ కనబరిచింది. ఇప్పటి వరకు రెండు బంగారు, మూడు కాంస్య పతకాలు గెలుచుకుంది.

కుటుంబ నేపథ్యం..

గూడూరు గ్రామంలో కుమారస్వామి నాగమణి దంపతులకు ముగ్గురు సంతానం కాగా ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వ్యవసాయ భూమి లేకపోవడంతో అదే గ్రామంలోనే భూమిని కౌలుకు తీసుకొని కుటుంబాన్ని పోషించుకున్నాడు. తండ్రి కుమారస్వామి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కీర్తన అక్క రికిత ఖమ్మంలో బీటెక్ చదువుతోంది. తమ్ముడు శివమణి గూడూరులో పదో తరగతి చదువుతున్నాడు. కీర్తన వరంగల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది.

అథ్లెటిక్స్ హిమాదాస్ స్ఫూర్తితోనే: కీర్తన

ప్రపంచ జూనియర్ అథ్లెటిక్స్‌లో పాల్గొని స్వర్ణ పతకం సాధించిన హిమాదాస్ స్ఫూర్తితోనే పరుగు పందెంలో రాణిస్తున్నాను. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి పతకాలు సాధించడమే లక్ష్యంగా ఆడుతాను. అందులో తీవ్రంగా కష్టపడుతున్నాను. ఆసియా గేమ్స్‌లో ఆడి భారతదేశానికి స్వర్ణం తీసుకువస్తా. దిండి అకాడమిలో కోచ్ పరశురాముడు, స్పోర్ట్స్ అధికారి రామ్‌లక్ష్మణ్‌ల సారథ్యంలోనే పరుగుపందెంలో జాతీయ స్థాయిలో రాణిస్తున్నాను.

గర్వంగా ఉంది: తల్లిదండ్రులు కుమారస్వామినాగమణి

మా కూతురు అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో ఆడి పతకాలు గెలుచుకోవడం గర్వంగా ఉంది. ఇప్పటి వరకు మొత్తం ఆరు పతకాలు సాధించింది. పాలకుర్తిలో చదువుకున్నప్పటి నుంచి మా కూతురు కీర్తనకు ఆటలపై శ్రద్ధ పెరిగింది. దీంతో ఆటలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధిస్తోంది. బాగా ఆడి దేశానికి పేరు తెస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నాం. మా బిడ్డ వల్ల గౌరవం పెరిగింది.

రామప్పను సందర్శించిన సీసీఎఫ్



రామప్ప దేవాలయం ఆవరణలో అధికారులతో సీసీఎఫ్ శివాని దొంగ్ర

వెంకటాపూర్(రామప్ప), జనవరి 13: మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని శనివారం సీసీఎఫ్ శివాని దొంగ్ర కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు వారిని సాదరంగా ఆహ్వానించగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె నందీశ్వరుడిని దర్శించుకోవడంతో పాటు ఆలయంలోని శిల్పకళా సౌందర్యాన్ని వీక్షించి అబ్బురపడ్డారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకు న్నారు. ఆమె వెంట ఎఫ్ఆర్‌వోలు శంకర్, కొండల్‌రెడ్డి, రవికుమార్, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

- పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, జనవరి 13: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లను సాధించిన ఉత్సాహంతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పని చేయాలని కోరారు. కష్టపడిన కార్యకర్తలకు భవిష్యత్‌లో గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మాజీ సర్పంచు గంగు కృష్ణమూర్తి, మార్కెట్ మాజీ చైర్మన్ రాఘవరావు, మాజీ ఎంపీపీలు కారుపోతుల శ్రీనివాస్, గడ్డం యాకసోమయ్య, కృష్ణమూర్తి, బాలరాజు, బీరు సోమేశ్వర్, నాగయ్య, భార్గవ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ..

పాలకుర్తి మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పున్నూరి వెంగళరావు, రాఘవాపురం గ్రామానికి చెందిన విద్యార్థి భరత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాలను శనివారం హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పరామర్శించారు. వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

దేవరుప్పుల: మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చీమల కొమురయ్య కుమారుడు రాము ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబసభ్యులను శనివారం హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్, నాయకులు వరికెల రతన్, కాడబోయిన గణేష్, కందుల భాస్కర్, సత్తయ్య, యాదయ్య పాల్గొన్నారు.

లయన్స్ వ్యవస్థాపకుడు

మెల్విన్ జోన్స్‌కు నివాళి



జనగామలో జోన్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లయన్స్ ప్రతినిధులు

జనగామ కల్చరల్, జనవరి 13: లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ 144వ జయంతిని శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బుస్సా సిద్దేశ్వర్ ఆతిథ్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమానికి లవకుమార్‌రెడ్డి అధ్యక్షత వహించగా మల్టిపుల్ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ కన్నా పరశురాములు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మెల్విన్ జోన్స్ పేరుతో స్థాపించిన లయన్స్ క్లబ్బులు ఎంతో ప్రజాదరణ పొందాయన్నారు. కార్యక్రమంలో భిక్షపతి, వడిచర్ల ప్రవీణ్, అల్లాడి ప్రభాకర్‌రావు, నాగబండి రవీందర్, గంగిశెట్టి ప్రమోద్ కుమార్, క్రిష్ణ జీవన్ బజాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: అంతర్జాతీయ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెల్విన్ జోన్స్ జయంతిని శనివారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘనంగా నిర్వహించారు. మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. క్లబ్ సీనియర్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీడీజీ జాన్ బన్నీ మాట్లాడారు. మెల్విన్ జోన్స్ స్థాపించిన లయన్స్ క్లబ్‌లు ప్రపంచ వ్యాప్తంగా దీనులను ఆదుకోవడానికి రక్తదాన, నేత్రదాన, అన్నదాన వైద్య పరీక్షా శిబిరాలు ఇతోధికంగా చేపడుతున్నాయన్నారు. సమావేశంలో క్లబ్ బాధ్యులు నిర్మల, మంజుల, మధు, హరికిషన్ రెడ్డి, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, పి.వెంకటేషం, శ్రీనివాస్, సదానందం, జి.సంపత్, పి.వేణు, జి.రమేశ్, డి.నరేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కోమల్లలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ మంజుల తదితరులు

రఘునాథపల్లి, జనవరి 13: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా నిరుపేదలతో పాటు రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బొల్లపల్లి మంజుల సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారి చేసే కార్యక్రమాన్ని కోమల్ల గ్రామంలో సర్పంచ్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంకు అధికారి వేణుమాదవ్, బీజేపీ నాయకులు మంద వెంకటేష్, వల్లాల ఉపేందర్, నరేష్, శ్రీనివాస్, ముప్పిడి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజ స్థాపనే మోదీ లక్ష్యం..

తరిగొప్పుల: అసమనతలు లేని సమసమాజ స్థాపనే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం అబ్దుల్‌నాగారం సర్పంచ్ రమ సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన మ్యు అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాషబోయిన రాజు, నాయకులు ఆవుల శ్రీనివాస్, బల్ల శ్రీనివాస్, రాంబ్రహ్మచారి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

సందడిగా మారిన మేడారం

వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు



వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 13: తాడ్వాయి మండలంలోని మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శనివారం అధికంగా తరలివచ్చారు. వచ్చే ఫిబ్రవరి 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ఆదివాసీ వనదేవతల మహా జాతర ఘనంగా జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ దూర ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని తల్లుల గద్దెలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించుకుని పూజలు చేశారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు. సుమారు 20వేలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని మేడారం ఎగ్జిక్యూటివ్ అధికారి రాజేంద్రం తెలిపారు.

క్రీడలతో యువకులకు ఉజ్వల భవిష్యత్తు

స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు





తలపడుతున్న క్రీడాకారులు, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ శ్రీనివాసరావు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 13: ఒకప్పుడు గ్రామాలకే పరిమితమైన కబడ్డీకి ప్రో కబడ్డీతో నేడు విశేష ఆదరణ లభిస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. ఛాగల్ గ్రామంలో స్వాగత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 16వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు క్రికెట్, టెన్నిస్, ఫుట్‌బాల్ క్రీడలకు ఉన్న ప్రాధాన్యత కబడ్డీకి కూడా వచ్చిందన్నారు. యువకులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వారికి క్రీడా కోట కింద ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, స్వాగత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కూన రాజు, చేపూరి ప్రభాకర్, అన్నెపు ఐలయ్య, అన్నెపు కుమార్, రంగు యాకయ్య, సౌదరపల్లి సంపత్‌రాజ్, పొన్న రాజేష్, రమేష్, రాజు, సదానందం, సాంబరాజు, పీఈటీలు చందర్, సుధాకర్, రాజు, షఫీర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బుర్రా వెంకటేశంను కలిసిన గెస్ట్ లెక్చరర్లు



వినతిపత్రం అందిస్తున్న అతిథి అధ్యాపకులు

జనగామ కల్చరల్, జనవరి 13: మోడల్ స్కూల్ కాలేజీ గెస్ట్ లెక్చరర్లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిశారు. శనివారం ఆయన నివాసంలో కలుసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని, 12నెలల జీతం చెల్లించాలని, ఆటో రెన్యువల్ ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.42 వేల వేతనం అందించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కమ్మంపల్లి అయిలయ్య, గాజన్ పాటిల్, కృష్ణ యాదవ్, శేఖర్, ఏడు కొండలు, లింగస్వామి పాల్గొన్నారు.

డోర్నకల్‌లో మరిన్ని రైళ్లకు హాల్టింగ్

డోర్నకల్, జనవరి 13: డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో త్వరలో మరికొన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ (పీసీవోఎం) నాగ్యా తెలిపారు. డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో న్యూఢిల్లీ, చెన్నై, ముంబై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రస్తుతం మూడోలైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, అవి పూర్తికాగానే నాల్గవ లైన్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

నేటి నుంచి పుష్‌పుల్ రైలు ప్రారంభం..

కాజీపేట - డోర్నకల్, డోర్నకల్- విజయవాడ, విజయవాడ-డోర్నకల్, డోర్నకల్-కాజీపేట మధ్య నడిచే పుష్‌పుల్ ప్యాసింజర్ ఆదివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు రైల్వేశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. డోర్నకల్‌కు వచ్చిన పీసీవోఎం నాగ్యా దృష్టికి ప్యాసింజర్ రైళ్ల రద్దు వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ డీఆర్‌యూసీసీ సభ్యులు తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన పీసీవోఎం ఆదివారం నుంచి పుష్‌పుల్ ప్యాసింజర్‌ను పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.

దళితుల సమస్యను పరిష్కరించాలి

సాధిక్ ఫౌండేషన్ చైర్మన్ సాధిక్ అలీ

పాలకుర్తి, జనవరి 13 : గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మంచుప్పుల గ్రామ దళితుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి సాధిక్ ఫౌండేషన్ చైర్మన్ సాధిక్ అలీ వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మంచుప్పల దళితులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించిందని, అయితే వాటిలో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అంతకు ముందు మంచుప్పుల గ్రామాన్ని సందర్శించి దుప్పట్లు పంపిణీ చేశారు.

కుంగిన లోలెవల్ వంతెన

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



బర్రెంకల చెరువు మత్తడి దిగువన కుంగిన లోలెవల్ వంతెన

చిలుపూర్, జనవరి 13: గుట్ట నుంచి చిలుపూర్ గ్రామంలోకి వెళ్ళే మార్గంలో బర్రెంకల చెరువు మత్తడి దిగువన ఉన్న లోలెవల్ వంతెన కుంగి ప్రమాదకరంగా మారింది. పెద్దగా గుంత ఏర్పడడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో మండల కార్యాలయాలు ఉన్నందున వివిధ పనుల నిమిత్తం ఆయా గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విశ్వకర్మ యోజన నమోదు

నర్మెట, జనవరి 13: మండలంలోని హన్మంతాపూర్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజునాయక్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. అన్ని కులాల పేదవారు అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ప్రధాని మోదీ విశ్వకర్మ యోజన పథకాన్ని తీసుకొచ్చారని అన్నారు. కేంద్రంలో మళ్లీ వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించి మోదీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొన్నె రాజు, నవీన్, పవన్, జంగిటి నాగేశ్వర్, రాజు, కృష్ణమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

నర్మెట, జనవరి 13 మండలంలోని వెల్దండ గ్రామంలో విహెచ్‌పీ, భజనమండలి సభ్యుల ఆధ్వర్యంలో రామజన్మభూమి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. శ్రీరాముని ఫోటోలు, రామజన్మభూమి నిర్మాణ భవ్య మందిర వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్ర వెంకటరమణరెడ్డి, వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, శాతెల్లి రాజు, వడ్డెపల్లి క్రాంతి, బొల్లం అవినాష్, వడ్డెపల్లి కిరణ్, నీల శ్రీకాంత్, వెంకటేష్, ప్రవీణ్, గణేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు

మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

దేవరుప్పుల, జనవరి 13: మండలంలోని రాంరాజుపల్లి గ్రామానికి చెందిన దాసగోని సత్యనారాయణ తల్లి సుశీల, అదే గ్రామానికి చెందిన ఉప్పునూతుల నాగరాజు తండ్రి వీరయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. నీర్మాల గ్రామానికి చెందిన మేడ రాంనర్సయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుమారుడు రాందయాకర్‌తో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కడవెండిగ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు దుబ్బాక రత్నాకర్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా ఆయనతో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు.

దేవరుప్పుల మండలకేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడి తల్లి అనసూయమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా, ఆమె కుటుంబసభ్యులను మంత్రి దయాకర్‌రావు పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు బస్వ మల్లేశం, చింత రవి, నర్సింహారెడ్డి, లీనారెడ్డి, సుడిగెల హన్మంతు, తాటిపెల్లి మహేష్, నాగేష్, నక్క రమేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'పోపా' క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ టౌన్, జనవరి 13: పద్మశాలీ ప్రొఫెషనల్స్ అండ్ అఫీషియల్స్ అసోసియేషన్ రూపొందించిన కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం జనగామలోని శ్రీభక్త మార్కండేయ స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనగామ పోపా అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు వేముల బాలరాజు, దోర్నాల శ్రీహరి, కేఎల్ఎన్ స్వామి, ఏల జనార్ధన్, కాముని శ్రీనివాస్, దోర్నాల కుమార్, ఎ.సింహాద్రి, బిట్ల విజయ్‌కుమార్, పిట్టల సతీశ్, మాదాసు ఎల్లయ్య, నల్ల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే సమాజాభివృద్ధి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి షబాన



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులను అందిస్తున్న షబాన

జఫర్‌గడ్, జనవరి 13 : ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగినపుడే సమాజ ప్రగతి సాధ్యమని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. షబాన అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి(జి)లో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన షబాన మాట్లాడుతూ మహిళలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐద్వా పోరాటం సాగిస్తుందన్నారు. సమస్యలపై మహిళలు సంఘటితమై ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి పర్వదినం తెలుగు ప్రజల జీవన సంస్కృతిని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సందర్భంగా రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దిడ్డి ఉష, రమ, గుర్రపు శృతి, నక్క అనూష, కొంతం జమున, దంతూరి అఖిల, సుస్రత్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



నర్మెటలో క్రికెట్ క్రీడలను ప్రారంభిస్తున్న సీఐ సాయిరమణ

నర్మెట, జనవరి 13: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని నర్మెట సీఐ సాయి రమణ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు గంగం నర్సింహరెడ్డి అందించిన టీ షర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్నెబోయిన రామకృష్ణ, బండి అశోక్, ముద్దం గట్టయ్య, మూల చందర్, గోపగోని నరేష్, ప్రజ్ఞాపురం శ్రీధర్, ప్రజ్ఞాపురం నర్సింహులు, కల్లూరి గణేష్, పల్లె ప్రభుదాసు, విక్రం, రాజశేఖర్, రాకేష్, అనీస్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనంలో కోర్టు వద్దు

(5వ పేజీ తరువాయి)

సరికాదని అన్నారు. అందులో విద్యార్థులు లేక ఐదేళ్లుగా భవనం ఖాళీగా ఉంటున్నందునే కలెక్టర్‌ను ఒప్పించి కోర్టు ఏర్పాటుకు ఆర్డర్ తీసుకువచ్చామని వివరించారు. ఈ క్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులకు, న్యాయవాదులకు మధ్య పెద్ద ఎత్తున వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న సీఐ సట్ల రాజు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను శాంతింప చేసే ప్రయత్నం చేశారు. కలెక్టర్ ఆర్డర్‌ను ధిక్కరించి గొడవలు చేయవద్దని ఎమ్మార్పీఎస్ నాయకులకు సూచించారు. వారు శాంతించడంతో గొడవ సద్దుమణిగింది. కార్యక్రమంలో న్యాయవాదులు కనకం రమేష్, గద్దె అనిల్, నీరటి కార్తిక్, గుర్రం బాబురావు, పిల్లి కార్తీక్, ఎమ్మార్పీఎస్ నాయకులు చాడ ఏలియా, గాదె శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిలుపూర్, జనవరి 11 : మండలంలోని పల్లగుట్టలో అనారోగ్యంతో కారణంగా మృతిచెందిన కుంచాల మల్లమ్మ కుటుంబాన్ని చిలుపూర్ గుట్ట ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు శనివారం పరామర్శించారు. వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పేరాల సుధాకర్, కుంచాల రాజు, మల్లేష్, గుర్రం యాదగిరి, సంపత్‌రాజు, ఎమ్డీ రఫీ తదితరులు ఉన్నారు.